క్రమబద్ధీకరించుకోవాల్సిందే..

- అదనపు లోడ్‌పై దృష్టి సారించిన విద్యుత్ శాఖాధికారులు
- వినియోగదారులకు జరిమాన విధిస్తున్న వైనం
- జూన్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ





విజయనగరం: పట్టణానికి చెందిన గృహ విద్యుత్ వినియోగదారుడు రామసుబ్బయ్యకు ప్రతి నెలా రూ.600 నుంచి 700 రూపాయల మధ్య బిల్లు వచ్చేది. అయితే ఇటీవల కాలంలో వినియోగం పెరగడంతో (నిర్దేశించిన లోడ్ కంటే ఎక్కువ వినియోగం) సాధారణ బిల్లుతో పాటు డవలప్‌మెంట్ చార్జీ పేరిట అధిక బిల్లు వస్తోంది. ఈ పరిస్థితి రామసుబ్బయ్య ఒక్కరిదే కాదు.. జిల్లా వ్యాప్తంగా చాలా మంది ఉన్నారు. అయితే ఇటువంటి సమస్యలను పరిష్కరించుకునేందుకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. లోడు క్రమబద్ధీకరించుకున్న వారికి అదనపు చార్జీల బెడద ఉండదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా కనెక్షన్ ఇచ్చే సందర్భంలో కిలోవాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2,500 వసూలు చేస్తారు. చాలా మంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1 నుంచి 2 కిలోవాట్ లోపలే చూపిస్తారు. అయితే వినియోగంలో అంతకు రెట్టింపు కేటగిరీలో చేరుతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికంటే ఏకంగా నాలుగింతలు ఉంటోంది.

క్రమబద్ధీకరణకు అవకాశం..

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ప్రతి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 నిర్ణయించారు. ఇదే సమయంలో డవలప్‌మెంట్ చార్జీ రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. కిలోవాట్‌లు పెరిగే కొద్దీ ఈ రుసుము మారుతుంది. దరఖాస్తుల స్వీకరణ మార్చి 1న ప్రారంభమై జూన్ 30వ తేదీతో ముగుస్తుంది. కిలోవాట్‌ల చొప్పున డవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

తీరనున్న లోవోల్టేజీ సమస్య

- గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో దీపాలు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా వేసి లోడును కిలోవాట్‌లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డవలప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం మంది గృహాలకైతే 1- 2 కిలోవాట్‌లు, దుకాణాలకు 2-3 కిలోవాట్‌లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే విద్యుత్ శాఖాధికారులు ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు.
- పట్టణీకరణ, ఇంటిలో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికంటే అధికంగా విద్యుత్ వినియోగం ఉంటోంది.
- వినియోగం అంచనాకు మించడంతో నియంత్రికలపై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం, లోవోల్టేజీ సమస్యలు పెరిగిపోతున్నాయి.
- లోడ్ క్రమబద్ధీకరణకు వినియోగదారులు దరఖాస్తు చేసుకుంటే లోడ్‌ను బట్టి ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం వల్ల లో ఓల్టేజీ సమస్యలు తీరనుంది.

జరిమాన బెడద ఉండదు..

- ఇప్పటివరకు అధిక లోడు నియంత్రణలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తరచూ ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడు వినియోగిస్తున్న వారిని గుర్తించి రుసుముతో పాటు జరిమాన వసూలు చేసేవారు.
- జిల్లా కేంద్రంలోని డీ1, డీ2, డీ3 ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో సుమారు 2 లక్షల పైగా కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మించి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కంటే అధికంగానే విద్యుత్ వాడుతున్నారు.
- గత ఐదేళ్లగా ప్రతినెలా ఉప కేంద్రం పరిధిలో తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగ్‌లు తనిఖీ చేసి అధిక లోడు వినియోగిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు.
- వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి అదనపు లోడును క్రమబద్ధీకరించుకుంటే ఈ అదనపు రుసుములు, జరిమానాల బెడద ఉండదని విజయనగరం నగర ఏడీఈ కిరణ్‌కుమార్ సూచిస్తున్నారు.

క్లుప్తంగా

బోరుబావులకు మరమ్మతులు



క్రాస్‌ప్రొగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గాయత్రి

భోగాపురం: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పాడైన బోరు బావులకు మరమ్మతులు చేపడుతున్నామని ఎంపీడీఓ గాయత్రి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రొగ్రం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉన్న 645 తాగునీటి బోర్ల మరమ్మతులకు సుమారు రూ.5 లక్షల ఎంపీపీ నిధులతో మెటీరీయల్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, మండల యూత్ కన్వీనర్ సుందర హరీష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అలేఖ్య, మెకానిక్ దేముడుబాబు, పి. గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళల సత్తా..



ఆదర్శ మహిళ అరుణను సత్కరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, కార్యకర్తలు

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తూ తమ సత్తా కనబరుస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆల్తి జ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తంగుడుబిల్లిలో ఆదర్శ మహిళ కురిమినేని అరుణను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. గతంలో వంటింటికి మాత్రమే పరిమితమైన మహిళలు నేడు విభిన్న రంగాల్లో సత్తా చాటుతున్నారన్నారు. దేశ రక్షణ రంగంలో కూడా నేటి మహిళలు కీలకంగా మారారని చెప్పారు. ఉన్నత స్థాయికి చేరుకున్న మహిళలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చిలకమ్మ, వరలక్ష్మి, జయప్రద, మహేశ్వరి, అప్పయ్యమ్మ, శ్యామల, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సందర్శన

విజయనగరం క్రైమ్: మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లిష్ స్కూల్ విద్యార్థినులు గురువారం స్థానిక కంటోన్మెంట్లో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులతో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత మమేకమయ్యారు. విద్యార్థినులతో మాట్లాడుతూ వారు వేసిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఉమెన్ హెల్ప్ డెస్క్ (రిసెప్షన్), డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, ఐటి కోర్ టీమ్, ఏఆర్ ఆఫీస్, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీమ్, స్పెషల్ బ్రాంచ్‌లను చూపించి సిబ్బంది విధులను వివరించారు. విద్యార్థినులు, మహిళలు ఆపద సమయాల్లో పోలీసుల సహాయం పొందేందుకు ఉపయోగపడే డయల్ 100/112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్181, సైబర్ క్రైమ్ 1930 నంబర్ల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, డీపీఓ ఏఓ పి.శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ శంకరరావు, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, ఎస్సై రాజేష్, ఆర్ఎస్సై వరప్రసాద్, పాఠశాల టీచర్లు ఉజ్వల, యశోద పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో కనక మహాలక్ష్మి



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి

విజయనగరం టౌన్: నగరంలోని సిటీ బస్టాండ్ వద్దనున్న కనక మహాలక్ష్మీ అమ్మవారు గురువారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు వీకే గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: నగరంలోని రాజీవ్ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి. త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోలగట్లవారి వీధి, కమ్మ వీధి, శివాలయం వీధి, ఉల్లి వీధి, పుచ్చల వీధి, మంగల వీధి, హుకుంపేట ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫిట్‌నెస్ మంజూరు ఏజెన్సీని రద్దు చేయాలి



ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు

భోగాపురం: జిల్లాలోని గరివిడి మండలం అచ్యుతాపురం వద్ద ఏర్పాటు చేసిన వాహనాల ఫిట్‌నెస్ ప్రైవేట్ ఏజెన్సీని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముక్కాం జంక్షన్ వద్ద సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఈ నెల పదో తేదీన చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల జీవితాలను ఇబ్బందులు పాల్జేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వేదాంత అనే స్వచ్ఛంద సంస్థకు ఫిట్‌నెస్ పత్రాలు జారీ చేసే కాంట్రాక్ట్ కట్టబెట్టిందన్నారు. ఫిట్‌నెస్ పత్రాల మంజూరు బాధ్యత ప్రభుత్వమే చూడాలి తప్ప... ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగిస్తే ఆటో కార్మికులు నష్టపోతారని చెప్పారు. ఈ మేరకు వేదాంత ఏజెన్సీని రద్దు చేయాలనే ఉద్దేశంతో ఈ నెల పదో తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి. సూర్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు వనం రమణ, వి. అప్పారావు, ఎం. సంజీవరావు, నక్క శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చే వరకూ పోరాటం తప్పదు

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్



అర్జీలు రాస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం: ఎన్నికల హామీలో భాగంగా పట్టణ లబ్ధిదారులకు రెండు సెట్లు, గ్రామీణ లబ్ధిదారులకు మూడు సెంట్ల ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ. 5 లక్షలు ఇచ్చేంతవరకూ సీపీఐ పోరుబాట కొనసాగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 20వ డివిజన్ బుచ్చెన్నకోనేరు (మార్క్స్ నగర్)లో గురువారం పర్యటించి లబ్ధిదారులతో ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు నింపించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఏర్పాటు చేసుకోవాలని ఉంటుందన్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు ఇంటి స్థలాలతో పాటు నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులచే పూర్తి చేయించిన దరఖాస్తులను అధికారులకు అందజేస్తామని చెప్పారు. సమావేశంలో సీపీఐ విజయనగరం నియోజకవర్గ సమితి నాయకులు పొందూరు అప్పలరాజు, అప్పురుబోతు జగన్నాథం, వెలగాడ రాజేష్, బూర వాసు, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా పీ4 సర్వే

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



హాజరైన సచివాలయ ఉద్యోగులు

విజయనగరం:

ఈ నెల 8 నుంచి 18 వరకు నిర్వహించనున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టిసిపేషన్ (పీ-4) సర్వేను విజయవంతం చేయాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సచివాలయ కార్యదర్శులకు ఆదేశించారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పీ 4 సర్వే ఆవశ్యకత, విధి విధానాలపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర సాధనకు పది సూత్రాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ప్రధానంగా జీరో పేదరికం లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం పీ 4 కార్యక్రమం చేపడుతోందన్నారు. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వాస్తవ సమాచారాన్ని సేకరించి జీఎస్‌డబ్ల్యూ యాప్‌లో డేటాను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవం

బొండపల్లి: మండల కేంద్రంలో కొలువైన ఎల్లమ్మ తల్లి పండగ సందర్భంగా సిరిమానోత్సవాన్ని గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు సిరిమానును గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఎల్లమ్మ తల్లి ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి గ్రామ పెద్దలతో పాటు గెద్దపేట, చందక పేట గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం అంగరంగ వైభవంగా సిరిమానును పూజారి అధిరోహించగా సిరిమానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ: బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య , క్షత్రియ, బ్రహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళా లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం. రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు. 75 శాతానికి పైగా హాజరు కలిగిన మహిళలకు సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టుమిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

అర్హతలు ఇవే ..

18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసుండి, తెల్లరేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి..

విజయనగరం టౌన్: బీసీ, కాపు, తెలగ, బలిజ, ఒంటరి, ఈబీసీ కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు సంబంధించిన మహిళా లబ్ధిదారులు కుట్టు శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘ కార్యనిర్వాహక సంచాలకుడు పెంటోజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఓబీఎమ్ఎమ్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో గాని సంబంధిత సచివాలయం, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాలలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కాయ దశలో మామిడిని కాపాడుకోవాలి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): కాయ దశలో ఉన్న మామిడి పంటను వ్యాపిస్తున్న కీటకాల నుంచి కాపాడుకోవాలని నూజివీడు కీటక శాస్త్రవేత్త జి.శాలిరాజు రైతులకు సూచించారు. గరివిడి మండలంలోని కాపుశంబం, ఐతాంవలస గ్రామాల్లో మామిడితోటలను ఉద్యానవన శాఖాధికారి చంద్రశేఖర్‌తో కలిసి ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పణుకులు ఎదుగుతున్న కాయదశలో ఉన్నాయని, చెట్టుకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల పొటాష్ చొప్పున ఎరువు వేసి నీటిని పెడితే కాయసైజు పెరుగుతుందని తెలిపారు. అదే విధంగా సువర్ణరేఖ మామిడి నిమ్మకాయ సైజు పరిమాణం దాటి ఉందని, 13.0.45 ఎరువును లీటర్ నీటికి 5-10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. సువర్ణరేఖ చెట్టుకు కూడా పణుగుల మాదిరిగానే ఎరువుతో కూడిన నీటి తడిని పెట్టాలని సూచించారు. బంగినపల్లి నిమ్మకాయ సైజులో ఉందని, తామరపురుగు వ్యాపించే అవకాశం ఉన్నందున పురుగు నివారణకు ఇమిడోక్లోఫైడ్ 0.3 మి.మీ లేదా థియోమిథాక్సామ్ 0.3 గ్రాముల రసాయనిక మందును నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

వ్యాయామ విద్యాభివృద్ధికి కృషి

- డీఈఓ మాణిక్యం నాయుడు



డీఈఓ మాణిక్యంనాయుడును కలిసిన వ్యాయామ ఉపాధ్యాయులు

విజయనగరం అర్బన్: వ్యాయామ విద్యాభివృద్ధికి జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి యూ. మాణిక్యంనాయుడు కోరారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జి.లక్ష్మణరావు, ఎస్.వెంకటనాయుడు గురువారం డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ..రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేసే విధంగా కృషి చేయాలన్నారు. అలాగే విద్యారంగ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్‌వీ రమణ, సూర్యారావు, తదితరులు ఉన్నారు.

మహిళా దినోత్సవం ..



విజయనగరంలోని వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మహరాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షురాలు పాకలపాటి రమణమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి మాట్లాడుతూ.. మహారాజా లేడీస్ రిక్రియేషన్ క్లబ్ నిర్వహణ పట్ల క్లబ్ అధ్యక్షురాలిగా వ్యవహరించిన రమణమ్మ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. అనంతరం బాలాజీ వాకర్స్ క్లబ్ మహిళలు ముల్లపూడి సుభద్రాదేవిని కూడా సత్కరించారు. కార్యక్రమంలో వనిత వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సాయి సంతోషిణి, కార్యదర్శి పార్వతి, ప్రతినిధులు సత్యకళ, సంస్కృత కళాశాల లెక్చరర్ జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం

ఘనంగా ఎల్లమ్మ తొలేళ్లు



ఎల్లమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వద్దనున్న ఎల్లమ్మ తల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సిరుల జాతరలో భాగంగా గురువారం తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సిరిమానోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ కార్మికులు

విజయనగరం టౌన్: గరివిడి మండలం అచ్యుతాపురంలో ఏర్పాటు చేసిన వేదాంత ఫిట్‌నెస్ సెంటర్‌ను ఎత్తివేయాలని కోరుతూ ఈ నెల 10న చలో అచ్యుతాపురం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ ఏఐఎఫ్‌టీయూ (న్యూ) సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నీలాపు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో కూడా ఫిట్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయకుండా..ఒక్క విజయనగరంలోనే ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్రైవేట్ ఏజెన్సీలు ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు ఇస్తే అవినీతి పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాలి సన్యాసిరావు, చెన్నా ధర్మారావు, కంది రాము, తర్లాడ శ్రీధర్, గేదెల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఘంటసాల' చిత్రాన్ని ఆదరించండి



ఘంటసాల చిత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాపీఠం ప్రతినిధులు

విజయనగరం టౌన్: మధుర గాయకుడు, పద్మశ్రీ ఘంటసాల జీవిత విశేషాలతో రూపొందించిన 'ఘంటసాల ది గ్రేట్' చిత్రాన్ని ప్రతిఒక్కరూ కుటుంబ సమేతంగా చూసి ఆస్వాదించాలని కౌముదీ పరిషత్ వ్యవస్థాపకుడు, ఘంటసాల స్మారక కళాపీఠం ప్రతినిధి ధవళ సర్వేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కొత్తపేటలోని ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో ఉన్న ధవళ కనకవేదికపై గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో చిత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిత్ర దర్శకుడు సీహెచ్ రామారావు తొలి ప్రయత్నంలోనే జాతీయ పురస్కారాన్ని అందుకున్నారన్నారు. ఘంటసాల జీవిత విశేషాల చిత్రాన్ని ఆయన నడయాడిన నేలపై ప్రదర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేకంగా మార్చి 9, 10, 11 తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు ఎస్‌సీఎస్ థియేటర్‌లో ప్రదర్శించనున్నారన్నారు. కార్యక్రమంలో ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు, షేక్ బాషా, సింహాచలం, రాజేంద్రప్రసాద్, సంతోష్‌కుమార్, లక్ష్మణరావు, తాడి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవిష్యత్‌కు టెన్త్ తొలి మెట్టు



కొత్తవలస కేజీబీవీలో టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేత

లక్కవరపుకోట/కొత్తవలస : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు టెన్త్ తొలి మెట్టు అని ప్రముఖ వైద్యులు, శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తెన్నేటి సుబ్బారావు అన్నారు. లక్కవరపుకోట, కొత్తవలస మండలాల్లోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 80 మంది విద్యార్థులకు పరీక్షల సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి సత్ఫలితాలు సాధించాలన్నారు. ఎల్.కోట, కొత్తవలస కేజీబీవీల ప్రత్యేక అధికారులు ప్రవీణ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాల కోసం ప్రచారం



ఎస్.కోట బాలికోన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ప్లస్ టూ గరల్స్ (బాలికల జూనియర్ కళాశాల)లో చేరాలని కోరుతూ ధర్మవరం ఉపాధ్యాయులు గురువారం ఎస్.కోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినిలతో సమావేశం అయ్యారు. ఎంఈఓ బి.నర్సింగరావు, హెచ్.ఎం విజయలక్ష్మి నేతృత్వంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మవరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ బాలికల జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, టెక్నో ల్యాబ్, డిజిటల్ గ్రంథాలయం , క్రీడా మైదానం వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. బాలికల చదువును ప్రోత్సహించటం కోసం ధర్మవరంలో ఉన్న జూనియర్ కళాశాలలో జాయిన్ కావాలని కోరారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ధర్మవరం హైస్కూల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు.